క్లుప్తంగా

ఆదోని డివిజన్‌లో తాగునీటికి కొరత లేదు



ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ పద్మజ

ఆదోని టౌన్: ఆదోని డివిజన్‌లో తాగునీటికి కొరత లేదని, ఎల్లెల్సీ కాలువ నుంచి వచ్చే నీటితో ఎస్ఎస్ ట్యాంకులు నింపామని ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ పద్మజ తెలిపారు. మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ డివిజన్‌లో 24 ఎస్ఎస్ ట్యాంకులు ఉన్నాయన్నారు. వచ్చే వేసవినాటికి ఎస్ఎస్ ట్యాంకులను పూర్తి స్థాయిలో నింపుతామని, వేసవిలో కూడా నీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రస్తుతం 50 నుంచి 70 శాతం మేర వరకు 15 నీటి ట్యాంకులు నింపామని, మిగిలిన నీటి పథకాలను త్వరలోనే పూర్తి స్థాయిలో నింపుతామన్నారు.

సెలవుల్లో పాఠశాలలు నిర్వహిస్తే చర్యలు

నందవరం/ఆదోనిసెంట్రల్/ పెద్దకడబూరు/ ఎమ్మిగనూరు టౌన్: ప్రైవేట్ పాఠశాలలు దసరా సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని నందవరం, ఆదోని, పెద్దకడబూరు ఎంఈఓలు రఘునాథ్, భూపాల్‌రెడ్డి, ఉస్మాన్‌బాషా, రామమూర్తి, ఆంజనేయులు, మధుసూదన్ రాజులు హెచ్చరించారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ..పాఠశాలలకు ఈ నెల 22 నుంచి అక్టోబర్ -2 వరకు దసరా సెలవులు ఉన్నాయని వివరించారు.

పత్తికి గిట్టుబాటు ధర కల్పించాలి

ఆదోని అర్బన్: పత్తి దిగుబడులకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతూ మంగళవారం యార్డు సెక్రటరీ గోవిందుకు రైతు సంఘం, సీపీఐ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం, సీపీఐ నాయకులు కల్లు బావిరాజు, ఎల్లప్ప, సత్యనారాయణ, అస్లాం, శేషప్ప మాట్లాడారు. పత్తి పంట అధిక వర్షాల వల్ల తెగుళ్లు వచ్చి దిగుబడి పూర్తిగా తగ్గిపోయిందన్నారు. రైతులను ప్రభుత్వం ఆదుకోలేని పక్షంలో వ్యవసాయం చేసేందుకు భవిష్యత్ తరం మొగ్గు చూపకపోవడం వంటి పరిణామాలు ఎదురవుతాయన్నారు. పత్తికి క్వింటానికి రూ.10 వేలు ప్రకారం రైతుల నుంచి ప్రభుత్వం నేరుగా కొనుగోలు చేయాలని కోరారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



పారిశుద్ధ్య కార్మికులను సన్మానించిన అధికారులు

గోనెగండ్ల : ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని డీఎల్‌డీఓ బాలకృష్ణ రెడ్డి సూచించారు. స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల కేంద్రం గోనెగండ్లలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం, పరిశుద్ధ్య పనులను ఎంపీడీఓ మణి మంజరితో కలిసి పరిశీలించారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులకు శాలువలతో, పూలమాలతో ఘనంగా సత్కరించారు. అలాగే సబ్బులు, నూనె, చెప్పులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ అనంతసేనా, పంచాయతీ ఈఓ సతీష్, సర్పంచ్ హైమవతి, సిబ్బంది మలాంగ్, హరి పాల్గొన్నారు.

నదీతీర ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



తుంగభద్ర నది ఉధృతిని పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసులు

నందవరం : అధిక వర్షాలతో టీబీ డ్యాం నుంచి దిగువకు నీటిని వదిలారని, నదీ పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ శ్రీనివాసులు సూచించారు. మంగళవారం మండల పరిధిలోని నాగలదిన్నె గ్రామంలోని తుంగభద్ర నది వరద ప్రవాహాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ..తుంగభద్ర నదికి వరద నీరు పెరుగుతుందని జాలర్లు, పశువుల కాపర్లు, బట్టలు ఉతకడానికి మహిళలు నది వైపు వెళ్లారాదని సూచించారు. అలాగే మండల పరిధిలోని జోహరాపురం గ్రామంలో ఉల్లి పంటను పరిశీలించారు. కార్యక్రమంలో వీఆర్వో కొండయ్య, వీపీఏ రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే శిక్ష తప్పదు

ఎమ్మిగనూరుటౌన్: కళాశాలలో ఈవ్‌టీజింగ్‌కు పాల్పడటం, మత్తుపదార్థాల వినియోగంతో అనర్థాలే ఎక్కువ అని, అంతేకాకుండా చట్టరీత్యా శిక్షార్హులవుతారని ప్రిన్సిపాల్ మహబుబ్ బాషా, శక్తి టీం కానిస్టేబుల్ జీటీ నాగన్న హెచ్చరించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ హెచ్ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో స్థానిక ఎస్ఎంఎల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం ఈవ్‌టీజింగ్, మత్తుపదార్థాల వినియోగంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మత్తుపదార్థాలకు విద్యార్థులు అలవాటు పడితే వారి భవిష్యత్ అంధకారమౌతుందని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.సుశీలమ్మ, అధ్యాపకులు క్రాంతికుమార్, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.



సోమలగూడూరులో గాయత్రీ దేవిగా పెద్దమ్మతల్లి



పెద్దకడబూరులో దుర్గాదేవిగా చౌడేశ్వరిదేవి



కందుకూరులో బ్రహ్మచారిణి దేవి అలంకరణలో శాంభవి దేవి



ఉప్పరహాల్‌లో బాలాత్రిపురసుందరిగా..



ఆదోనిలో అన్నపూర్ణేశ్వరి అలంకరణలో వాసవీ కన్యకా పరమేశ్వరిదేవి



ఎం.ఎం.కాలనీలో గాయత్రీదేవి అలంకరణలో మాతా పరమేశ్వరిదేవి

గాయత్రీ దేవి.. నమోస్తుతే

ఎమ్మిగనూరుటౌన్: దుర్గా దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా మంగళవారం పలు ఆలయాల్లో అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పట్టణంలోని వీవర్స్ కాలనీ, గాయత్రీ దేవి, వాసవిమాత ఆలయంతో పాటు పలు ఆలయాల్లో రెండవ రోజు అమ్మవారు పలు అలంకరణలోభక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక వీవర్స్ కాలనీ మైదానంలో స్వామివివేకానంద సేవా సంస్థ సభ్యులు ఏర్పాటు చేసిన మండపంలోని వేదగాయత్రీ ఆలయంలో అమ్మవారు గాయత్రీ దేవి రూపంలో దర్శనమిచ్చిచ్చారు.

- కోసిగి: మండలంలోని కందుకూరు గ్రామంలో వెలసిన శాంభవి దేవి గాయత్రి దేవి అలంకరణలో దర్శనమిచ్చారు.
- నందవరం : ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం గురజాల రాలింగేశ్వర స్వామి క్షేత్రంలో మంగళవారం అమ్మవారు బాలా త్రిపుర సుందరి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. సోమలగూడూరు గ్రామంలో పెద్దమ్మ దేవి అమ్మవారు గాయత్రీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనిమిచ్చారు. గురజాల గ్రామంలో గ్రామస్తులు అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు.



ఎమ్మిగనూరు వేద గాయత్రీ ఆలయంలో నిజరూపంలో దర్శనమిచ్చిన అమ్మవారు

దుర్గాదేవిగా అమ్మవారు..



గాజుల అలంకరణలో దర్శనమిస్తున్న శ్రీ మహాయోగి లక్ష్మమ్మవ్వ

పెద్దకడబూరు : శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండవరోజు మంగళవారం మండల కేంద్రంలో శ్రీచౌడేశ్వరిదేవి అమ్మవారు, కాళికాదేవి అమ్మవారు, మండల పరిధిలోని దొడ్డిమేకలలో వెలసిన పార్వతీదేవి అమ్మవారు దుర్గాదేవిగా కొలువుదీరి భక్తులకు దర్శనమిచ్చారు. మండల కేంద్రంలోని చిన్న లక్ష్మమ్మవ్వ, పెద్ద లక్ష్మమ్మవ్వలతో పాటు మండల పరిధిలోని బాపురం, చిన్నతుంబళం తదితర గ్రామాలలో వెలసిన అమ్మవార్లు వివిధ రూపాలలో భక్తులను కనువిందు చేశారు.

- కౌతాళం: మండలకేంద్రంలో వెలసిన చౌడేశ్వర దేవి అమ్మవారి ఆలయంలో, అలాగే ఉప్పరహాల్ గ్రామంలో వెలసిన అమ్మవారిని బాలా త్రిపురసుందరి అవతారంలో అలంకరించారు. అలాగే కౌతాళంలోని ఈరన్న కట్టవద్ద ఉన్న మహంకాళి దేవి, ఉరుకుందలో వెలసిన అమ్మవార్లను ప్రత్యేక పూజలు చేపట్టారు.

వివిధ అలంకరణలో అమ్మవార్లు

ఆదోని అర్బన్: పట్టణంలో రెండో రోజూ అమ్మవార్లను వివిధ రూపాల్లో అలంకరించారు. ఆదోని ఇలవేల్పు శ్రీ మహాయోగి లక్ష్మమ్మవ్వ గాజుల అలంకరణ, నగరేశ్వరస్వామి ఆలయంలో వెలిసిన శ్రీ వాసవీమాతను అన్నపూర్ణేశ్వరిగా, ఎం.ఎం.కాలనీలో వెలిసిన మాతా పరమేశ్వరిదేవిని గాయత్రీదేవి అలంకరణలో, శ్రీ పేట వీరభద్రేశ్వరస్వామి వారు ఖర్జూర, గోడంబి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.



ఖర్జూర, గోడంబి అలంకరణలో శ్రీ పేట వీరభద్రేశ్వరస్వామి

నానో యూరియా పంటలకు శ్రేయస్కరం

ఎమ్మిగనూరురూరల్: రైతులు నానో యూరియా వాడటం పంటలకు శ్రేయస్కరమని ఏడీఏ మహమ్మద్‌ఖాద్రి, ఏవో ఎం. శివశంకర్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని గుడేకల్ గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నానో యూరియా స్ప్రే చేయటం వలన 100 శాతం సమర్థవంతంగా పంటలకు ఉపయోగపడుతుందని, అదే మాములు యూరియా వాడితే 50 శాతం వేస్టేజ్ అవుతుందని తెలిపారు. రైతులు మాములు యూరియా బదులుగా నానో యూరియాను ఉపయోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈవోలు నరసింహుడు, వినోద్, రసూల్, వీపీఏ హిమబిందు పాల్గొన్నారు.



వరి పొలాన్ని పరిశీలిస్తున్న ఏడీఏ మహమ్మద్‌ఖాద్రి ఏఓ మదిరేపల్లి శివశంకర్, రైతులు

ప్రజలను మభ్యపెడుతున్న కూటమి ప్రభుత్వం

ఆదోని సెంట్రల్: కూటమి ప్రభుత్వం ప్రజలకు మాయమాటాలు చెబుతూ ప్రజలను మభ్యపెడుతున్నారే తప్ప ప్రజాసంక్షేమాన్ని పట్టించుకోవడం లేదని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు వై. సాయినాథ్ విమర్శించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నేడు 5 టన్నుల టిప్పరు ఇసుక రూ. 25వేలు పైన అమ్ముతున్నారని తెలిపారు. గతంలో ఇదే కూటమి నాయకులు ఇసుక ధరలపై గోల చేస్తూ గగ్గొలు పెట్టిన సందర్భాలు ఉన్నాయన్నారు. అధికారంలోకి వస్తే ఉచిత ఇసుక ఇస్తానని చెప్పి ఇప్పుడు ఇసుక దందాను జోరుగా కొనసాగిస్తున్నారని ఆరోపించారు. అధికారులు కూడా చూసి చూడనట్లు వ్యవహరించడం దారుణమన్నారు. ఈ విషయంపై స్థానిక ఎమ్మెల్యే డా. పార్థసారథి అసెంబ్లీలలో ప్రస్తావిస్తానని చెపడం చూస్తుంటే ఇసుక మాఫియా ఏ స్థాయిలో రెచ్చిపోతుందో అర్థమవుతుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మాజీ జిల్లా ఉపాధ్యక్షులు దిలీప్‌దోకా, నాయకులు మారుతిరావు పట్టణ యువజన నాయకులు మారుతిరావు, దేవి శెట్టి వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

పీ-4 కుటుంబాలను గుర్తించాలి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో చేపట్టే సర్వే ఆధారంగా పీ-4కు అర్హత ఉన్న కుటుంబాలను గుర్తించాలని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి సూచించారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో వార్డు సచివాలయ, మున్సిపల్ సిబ్బందికి పీ4 (పబ్లిక్, ప్రైవేట్, పీపుల్ పార్టనర్షిప్)పై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పీ4 కై నిర్వహించాల్సిన సర్వే, ఆర్థికంగా స్థిరమైన కుటుంబాలు ఆర్థికంగా బలహీనంగా వుండే కుటుంబాలను మార్గదర్శకత్వం , ఆర్థిక సహాయం అందించే విధానాలు తదితర అంశాలపై మాస్టర్ ట్రైనర్లు హంపిరెడ్డి, శ్రీనివాసులు, ఉరుకుంద, నరసింహులు శిక్షణ ఇచ్చారు.

నిరుపేదల ఎదుగుదలకు కృషి చేద్దాం

కోసిగి: మండలంలోని నిరుపేదలను గుర్తించి వారి ఎదుగుదలకు కృషి చేయాలని మంత్రాలయం నియోజకవర్గ పీ-4 అధికారి రాజు సూచించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏఓ హరిలీలా ఆధ్వర్యంలో మండలంలోని సచివాలయాల అన్ని శాఖల ఉద్యోగులతో పీ-4 సమీక్ష సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ నిరుపేదలను గుర్తించి వారికి ఎలాంటి అవసరాలు ఉన్నాయో గుర్తించి నివేదిక తయారు చేసి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్స్ అన్నీ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న ఉల్లి పంటను అంచనా వేయాలి

ఆదోని రూరల్: ఖరీఫ్ సీజన్‌లో వర్షాల కారణంగా దెబ్బతిన్న ఉల్లి పంటను అంచనా వేయాలని ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ అధికారులను ఆదేశించారు. మంగళవారం మండలంలోని మదిరె గ్రామంలో ఉల్లి పంట సాగుచేసిన ప్రాంతాలను ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ పంట నష్టం అంచనాలో ఎలాంటి ఫిర్యాదులు రాకుండా జాగ్రత్తగా చేయాలన్నారు. రైతులకు అన్యాయం జరగకుండా ప్రతి ఎకరాకు కచ్చితమైన లెక్క నమోదు చేయాలన్నారు. అలాగే ఇంటి పట్టాల మంజూరుకు అనువైన స్థలాలను గుర్తించి అర్హులైన ప్రతి కుటుంబానికి పట్టాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామంలో ఇంటి పట్టా కోసం దరఖాస్తు చేసుకున్న వివరాలను సంబంధిత అధికారులతో సమీక్షించారు. తహసీల్దార్ రమేష్, ఆర్ఐ లక్ష్మయ్య, వీఆర్వో శ్రీనివాసులు, సిబ్బంది ఉన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్

ఎంపీపీ దానమ్మపై అవిశ్వాస తీర్మానం!



అవిశ్వాస తీర్మానం నోటీసు ఇచ్చేందుకు సబ్‌కలెక్టర్ కార్యాలయం ముందు వేచి ఉన్న ఎంపీటీసీలు

ఆదోని టౌన్: ఆదోని మండల పరిషత్ అధ్యక్షురాలు దానమ్మపై వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలు అవిశ్వాస తీర్మానం పెట్టారు. మంగళవారం అవిశ్వాస తీర్మానం నోటీసులను సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్‌కు వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి చంద్రకాంత్‌రెడ్డి, సీనియర్ నాయకులు గురునాథ్‌రెడ్డి, వైస్ ఎంపీపీ నరేందర్‌రెడ్డి, విరుపాపురం ఎంపీటీసీ శివకుమార్ మరికొందరు ఎంపీటీసీలు సబ్ కలెక్టర్ నోటీసు ఇచ్చేందుకు వెళ్లారు. అయితే మంగళవారంతో నాలుగేళ్లు పూర్తి అవుతుందని, బుధవారం ఉదయం 10.30 గంటలపైన నోటీసు ఇవ్వాలని సబ్‌కలెక్టర్ ఎంపీటీసీలకు సూచించారు. దీంతో బుధవారం అవిశ్వాస తీర్మాన నోటీసు ఇస్తామని చంద్రకాంత్‌రెడ్డి, గురునాథరెడ్డి, శివకుమార్ తెలిపారు.

డీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడిగా ధణాపురం ఉదయ్

ఆదోని రూరల్: డీఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ధణాపురం ఉదయ్‌ను నియమించారు. మంగళవారం స్థానిక సంఘం కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ డీఎస్ఎఫ్ జేఎన్‌యూ జనరల్ సెక్రటరీ మున్నేహ ఫాతిమా, వైస్ ప్రెసిడెంట్ మనీషా ఆదేశాల మేరకు తనను రాష్ట్ర నాయకుడిగా తననుఎంపిక చేశారన్నారు. డీఎస్ఎఫ్‌లో పనిచేసిన మహేంద్రనాయుడికి ప్రస్తుతం సంఘంతో ఎటువంటి సంబంధం లేదన్నారు. కార్యక్రమంలో డీఎస్ఎఫ్ నాయకులు నవీన్, రాజ్ కుమార్, చరణ్, రాము, కుమార్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఉదయ్

అధికారుల నిర్లక్ష్యం రైతులకు శాపం

కోసిగి: అధికారుల నిర్లక్ష్యం కోసిగి మండలంలో ఉల్లి రైతులకు శాపంగా మారిందని ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం మండల నాయకులు వీరేష్, రాముడు, శ్రీనివాసులు ఆరోపించారు. మంగళవారం కోసిగి వ్యవసాయ కార్యాలయం ఎదుట ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో ఉల్లి రైతులు ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ కోసిగి మండలంలో దాదాపు 2వేల ఎకరాలకు పైగా ఉల్లి పంటను సాగుచేసుకున్నారన్నారు. అయితే అధికారుల లెక్కల ప్రకారం 1,600 ఎకరాలు ఉల్లిపంట వేసినట్లు చూపుతున్నారన్నారు. అధికారులు ఉల్లి పంట ఈక్రాప్ తక్కువ నమోదు చేయడం వల్ల చాల మంది ఉల్లి రైతులు పంట నష్టపరిహారం అందకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం వ్యవసాయాదికారి వరప్రసాద్‌కు వినతి పత్రం అందించారు. ధర్నాలో ఉల్లి రైతులు శివయ్య, ప్రకాష్, చిన్నకోసిగయ్య, పెద్దలక్ష్మన్న, శ్రీనివాసులు, మహాదేవా, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయాధికారుల సూచనలు పాటించండి

పెద్దకడబూరు : ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పంటలు నష్టపోకుండా రైతులు వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలని మండల వ్యవసాయాధికారిణి సుచరిత సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల పరిధిలోని పీకలబెట్ట, హులికన్వీ గ్రామాలలో పంట నమోదు ప్రక్రియను పర్యవేక్షించారు. ఆమె మాట్లాడుతూ ముఖ్యంగా అధిక వర్షాలకు పంట పొలాల్లో నీరు నిలువ లేకుండా చూసుకోవాలన్నారు.

కర్నూలులో హైకోర్టు ఏర్పాటు చేయాలి

కర్నూలు(సెంట్రల్): కర్నూలులో హైకోర్టును ఏర్పాటు చేయాలని కోరుతూ న్యాయవాదులు చేపట్టిన దీక్షలు రెండో రోజూ కొనసాగాయి. శ్రీకృష్ణ దేవరాయల సర్కిల్‌లోని శిబిరంలో న్యాయవాదులు వి.కృష్ణమూర్తి, ఎస్.నరసింహ, బి.శ్రీనివాసులు, అయ్యస్వామి, రాము తదితరులు దీక్షలో కూర్చొని శ్రీబాగ్ ఒడంబడిక ప్రకారం కర్నూలులో హైకోర్టును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. జోరు వర్షం కురుస్తున్నా న్యాయవాదుల దీక్షలు కొనసాగాయి.